ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 23.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

సోమవారం 8 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.60 (120.0608)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.53 (2.68)	12.26	59.87
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	95.30 (0.44)	694	నిల్

చికెన్ ధరలు: లైవ్ : రూ.142 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

శిథిల భవనాలతో భయం భయం..



భువనగిరిలో జనావాసాల మధ్య ఉన్న శిథిల గృహం

ఆంధ్రజ్యోతి ఫోకస్

వర్షాకాలంలో శిథిల భవనాలతో ప్రమాదం పొంచివుంది. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉండగా, వాటిలో నివసించే ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. మెజార్టీ శిథిల భవనాలను యజమానులు ఖాళీ చేయగా, మరికొన్నింటిలో నివాసం ఉంటున్నారు. అయితే ప్రమాదాల నివారణకు వర్షాకాలం ప్రారంభానికి ముందే శిథిల భవనాలను తొలగించాలని యజమానులకు మునిసిపాలిటీ అధికారులు నోటీసు జారీ చేసిన కొందరు వాటిని బేఖాతరు చేస్తున్నారు. ఈ భవనాల కారణంగా చుట్టుపక్కల నివాసం ఉంటున్నవారు సైతం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)/ భువనగిరిటౌన్,రామగిరి,దేవరకొం డ, మిర్యాలగూడటౌన్, డిండి, నార్కట్‌పల్లి, చింతపల్లి, మోటకొండూర్, భువనగిరి రూరల్, చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్, వలిగొండ



నల్లగొండ పాత బస్తీలో శిథిలావస్థకు చేరిన భవనం

- వర్షాకాలంలో పొంచివున్న ప్రమాదం
- ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ సెంటర్ ప్రాంతంలో పాత భవనం శిథిలావస్థలో ఉంది. ఈ భవనంలో నాలుగు నుంచి ఐదు వరకు చిరు దుకాణాలు ఉన్నాయి. పదుల సంఖ్యలో ఇక్కడికి కొనుగోలుదారులు వస్తుంటారు. ఈ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. నల్లబావి సమీపంలో పాతబడిన భవనంలో ఓ కుటుంబం నివాసం ఉంటోంది. భీమారం రోడ్డు కృష్ణా థియేటర్ ప్రాంతంలో సుమారు 5 నుంచి 8 వరకు పాత భవనాలు ఉండగా, వాటిలో పలు కుటుంబాలు నివసిస్తున్నాయి. అలంకార్ థియేటర్ ప్రాంతంలో పాత భవనంలో కుటుంబాలు నివసించడంతోపాటు పూలదుకాణాలు నిర్వహిస్తున్నారు. బొడ్రాయి బజార్ సమీపంలో పలు భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. సుందరయ్యనగర్‌లో పేదల కోసం 2009లో అప్పటి ప్రభుత్వం 96 ఇళ్లతో కలిపి ఒక అపార్ట్‌మెంట్‌ను నిర్మించింది. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థలో ఉంది. వీటితోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శిథిల భవనాలు ఉన్నాయి. వర్షాలకు తడిసి ఇంటి పైకప్పులు, గోడలు నానుతున్నాయి. ఇవి ప్రమాదకరంగా ఉన్న ప్రజలు నివాసం ఉంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఇళ్లలో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి కూల్చివేయాల్సిన అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. గత ఏడాది నాగారం మండల కేంద్రంలో ఓ ఇల్లు కూలి ముగ్గురు మృతి చెందారు. ఆ ఇంటిని ముందుగానే గుర్తించి ఖాళీ చేయిస్తే ప్రాణాలు దక్కేవి.

నోటీసులు జారీచేసినా

జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల్లో గతఏడాది శిథిలావస్థకు చేరిన భవనాలకు మునిసిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. అయితే అది ఎక్కడా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. గతంలో వర్షాకాలం ప్రారంభంలో జిల్లాలోని సూర్యాపేట మునిసిపాలిటీలో 41, కోదాడలో ఏడు, హుజూర్‌నగర్‌లో ఆరు, నేరేడుచర్లలో మూడు, తిరుమలగిరిలో ఆరు భవనాలకు మునిసిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇంకా సమగ్రంగా సర్వే చేస్తే పురాతన భవనాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గ్రామాల్లో కూడా శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉన్నాయి. వాటిని పంచాయతీ అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేయడంతోపాటు కూల్చివేయించాల్సి ఉంది.

నా ఇంటికి మరమ్మతు చేయించాలి



భువనగిరి జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన సుమారు 75 ఏళ్ల వయసు ఉన్న వృద్ధురాలు పలకబండ జంగమ్మ శిథిలావస్థకు చేరిన సొంత ఇంటిలో ఒంటరిగా నివసిస్తోంది. ప్రమాద తీవ్రత దృష్ట్యా ఆ ఇంటిని తొలగించాలని మునిసిపల్ సిబ్బంది నోటీసులు ఇచ్చారు. ఆమెను మరో ఇంటికి తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు మునిసిపల్ సిబ్బంది సూచించారు. అయినా ఆమె ఇంటిని ఖాళీ చేసేది లేదని భీష్మిస్తుండడంతోపాటు, తన ప్రాణాలను కాపాడాలనుకుంటే ఇంటికి మరమ్మతులు చేయించాలని అంటోంది.

మూడు గదుల్లో రెండు కూలాయి



శిథిలావస్థకు చేరుకున్న మూడు గదుల ఇంటిలో రెండు గదులు కూలిపోయాయి. ఉన్న ఒక్క గది కురుస్తోంది. ఇది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. వర్షం వస్తే ఇంటినిండా నీళ్లు చేరుతున్నాయి. అప్పుడు ఇంటిలో ఓ మూలకు పడుకుంటున్న.

- ఎండి.అబ్దుల్‌బీ, చౌటుప్పల్

శిథిల గృహాలను గుర్తించాం



భువనగిరిలో శిథిల గృహాలను వర్షాకాలం సీజన్‌కు ముందే గుర్తించి నోటీసులు జారీ చేశాం. కొద్ది మంది గృహాలను తొలగించుకున్నారు. ఒకటి, రెండు ఇళ్లలో మాత్రమే యజమానులు, వారి బంధువులు ఉంటున్నారు. వారిని కూడా ఖాళీ చేయించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. నోటీసులకు స్పందించకుంటే యజమానులపై చర్యలు తీసుకుంటాం. శిథిల గృహాలను తొలగించుకునే ఆర్థికస్థోమత లేనివారికి మునిసిపాలిటీ సహకరిస్తుంది.

- పి.రామాంజల్‌రెడ్డి, భువనగిరి మునిసిపల్ కమిషనర్

స్వచ్ఛందంగా తొలగించుకోవాలి



నల్లగొండ పట్టణంలో 28 భవనాలు శిథిలావస్థకు చేరినట్టు గుర్తించాం. అందులో కొన్ని మరమ్మతులు చేసుకోవల్సిందిగా, మరికొన్నింటిని తక్షణమే తొలగించుకోవాలని నోటీసుల జారీ చేశాం. నోటీసులు ఇచ్చి 15 రోజులైంది. మరోమారు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను మునిసిపల్ సిబ్బందితో తొలగిస్తాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, నల్లగొండ మునిసిపల్ కమిషనర్

గతంలోనే నోటీసులు ఇచ్చాం



గతంలో సూర్యాపేట పట్టణంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చాం. వాటిని కూల్చివేయాలని ఆదేశించాం. ఆ ఇళ్లలో నివాసం ఉండవద్దని సూచించాం. శిథిలావస్థకు చేరిన ఇళ్లు వర్షాలు వచ్చినప్పుడు నాని కూలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- బి.శ్రీనివాస్, సూర్యాపేట మునిసిపల్ కమిషనర్



సూర్యాపేట జిల్లా కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న భవనం

భువనగిరిలో..

భువనగిరి పట్టణంలో 40కి పైగా శిథిల భవనాలు ఉన్నాయి. వాటిలో మెజార్టీ గృహాలు ఖాళీగా ఉండగా, మరికొన్నింటిలో యజమానులు నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో మునిసిపల్ సిబ్బంది మూడు ఇళ్లను నేలమట్టం చేశారు. శిథిల గృహాలు పాత బస్తీలలో అధికంగా ఉన్నాయి. మునిసిపల్ నోటీసులపై యజమానులు స్థానిక నాయకులను ఆశ్రయిస్తుండడంతో వాటి తొలగింపులో రాజకీయ ప్రమేయం పెరుగుతున్నట్టు తెలుస్తోంది. గత వర్షాకాలం సీజన్‌లో మునిసిపల్ అధికారులు నోటీసులు జారీ చేయగా, అప్పట్లో 15కు పైగా శిథిల భవనాలను యజమానులు, మునిసిపల్ సిబ్బంది తొలగించారు.

● మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన బొట్ల శ్రీనివాస్ ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షానికి గోడ సహా ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంటిపై పరాదలు, ప్లెక్సీలు అడ్డుగా కప్పి నివాసం ఉంటున్నారు. ● భువనగిరి మండలంలో గత ఏడాది పల్లె ప్రగతి కార్యక్రమంలో 34 పంచాయతీ పరిధిలో పూర్తిగా శిథిలావస్థకు చేరిన సుమారు 800 ఇళ్లను కూల్చివేశారు. ఆరు నెలల క్రితం మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు పైకప్పు, గోడలు పూర్తిగా ధ్వంసమైన 15 ఇళ్ల యజమానులకు అధికారులు నోటీసులు జారీచేశారు. ప్రస్తుత వర్షాకాలంలో శిథిలావస్థకు చేరిన ఐదు ఇళ్లను గుర్తించిన అధికారులు వాటిని కూల్చివేస్తామని తెలిపారు. ● చౌటుప్పల్ మండలం దామెరలో పెరుమళ్ల అంజమ్మ, పెరుమళ్ల అమృత, సాతిరి లక్ష్మమ్మ ఇళ్లు శిథిలావస్థకు చేరి వర్షం వస్తే కూలే దశలో ఉన్నాయి. ● చౌటుప్పల్ మునిసిపాలిటీలో విలీన పంచాయతీలు తంగడపల్లి, లింగోజీగూడెం, తాళ్లసింగారం, లక్కారం, లింగారెడ్డిగూడెంలో శిథిల గృహాలు ఉన్నాయి. ప్రమాదకరంగా మారిన ఇళ్లు 40 నుంచి 50 వరకు ఉండవచ్చునని అధికారుల అంచనా. పెంకుటిళ్లు దెబ్బతినడంతో వర్షపు నీరు ఇంటిలోకి వస్తోందని, దీంతో ప్లాస్టిక్ కవర్ కప్పి భయం భయంగా నివాసం ఉంటున్నామని, ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని బీసీ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఎండి.ఖాదర్ కోరుతున్నాడు. ● వలిగొండ మండలంలో పులిగిల్ల, వేములకొండ గ్రామాల్లో శిథిల గృహాలు ఉన్నాయి. పులిగిల్ల గ్రామంలో మొత్తం 876 ఇళ్లు ఉండగా, 25 కుటుంబాలకు అసలు ఇళ్లే లేవు. వారు అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారు. కొన్ని శిథిల గృహాలు వానలకు దెబ్బతినకుండా గోడలపై టార్పాలీన్లు కప్పి పలువురు నివాసం ఉంటున్నారు.



వేములకొండలో బొంత పెద్ద ఈదయ్య, ఎల్లమ్మ దంపతుల ఇళ్లు

నల్లగొండలో..

● నల్లగొండ పట్టణంలో ప్రధానంగా పాతబస్తీ, మాన్యంచెల్క, అక్కచెలమ, శ్రీకృష్ణనగర్, బీటీఎస్ ప్రాంతాల్లో అధికంగా శిథిల భవనాలు ఉన్నాయి. వీటి యజమానులు ఉద్యోగం, వ్యాపారరీత్యా హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉండటంతో ఆలనాపాలన లేక భవనాలు శిథిలావస్థకు చేరాయి. పాతబస్తీ సిమెంట్ రోడ్‌లో పలు భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉండగా, అటుగా వెళ్లే బాటసారులు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలో 70కిపైగా శిథిల భవనాలు ఉన్నాయి. ఇందులో 28 ప్రమాదకరంగా ఉన్నట్టు మునిసిపల్ అధికారులు గుర్తించారు. వాటిని తక్షణమే తొలగించాలని నెలరోజుల క్రితమే మునిసిపల్ అధికారులు యజమానులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా భవనాలను తొలగించడం లేదా సరిచేసుకోవాలని నోటీసులో పేర్కొన్నా, సంబంధిత యజమానులు నేటికీ ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. ● దేవరకొండలో మునిసిపల్ అధికారులు 35 శిథిల భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశించడంతో 25కుపైగా భవనాలను ఖాళీ చేశారు. మరికొంత మంది ప్రత్యామ్నాయంగా రేకుల షెడ్డులను ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. అదేవిధంగా మండలంలో శిథిల ఇళ్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే మండల పంచాయతీ అధికారి నీలిమా ఆదేశాలు జారీచేశారు. ● మిర్యాలగూడ పట్టణంలో పెద్దబజార్, నెహ్రూనగర్, సీతారాంపురం, షాబూనగర్ తదితర కాలనీలలో శిథిల భవనాలు ఉన్నాయి. ● డిండి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఏకుల చంద్రయ్యతోపాటు ఆయన భార్య రంగమ్మ, కొడుకు, కోడలు, మనవరాలుతో కలిసి మట్టి గోడలతో ఉన్న ఇంటిలో నివాసం ఉంటున్నారు. భారీ వర్షాలకు కూలిపోయే స్థితిలో ఉన్న మట్టి మిద్దెలో కాలం వెళ్లదీస్తూ బిక్కు, బిక్కుమంటు నివాసం ఉంటున్నారు. కూలీ, నాలి చేసుకొని జీవించే వీరు పక్కాగృహం నిర్మించుకునే స్థోమతలేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ● నార్కట్‌పల్లి మండల వ్యాప్తంగా సుమారు 200కు పైగా శిథిలావస్థకు చేరిన నివాసాలు ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో 'పల్లె ప్రగతి' కింద 15 రోజుల పాటు శిథిలావస్థకు చేరిన నివాసాలను గుర్తించే కార్యక్రమం చేపట్టి ప్రమాదకర ఇళ్లను కూల్చాలని పంచాయతీ అధికారులు యజమానులకు నోటీసులు జారీచేశారు. కొన్నింటిని కూల్చగా, మరికొన్ని అలానే ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతిగది పైకప్పు పెచ్చులూడి విద్యార్థులున్నపుడే పడిన సంఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది.



డిండిలో శిథిలావస్థలో ఉన్న మట్టి ఇల్లు

ప్రజా ప్రభుత్వమంటే లొంగదీసుకోవడమేనా?

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



దత్తప్పగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

మోత్కూరు, జూలై 7: ప్రజా ప్రభుత్వమంటే ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులను నయానో, భయానో, లేదంటే కొనుక్కొనో లొంగదీసుకుని తమ పార్టీలో కలుపుకోవడమేనా? అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆయిల్ ఫెడ్ మాజీ రాష్ట్ర చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. మోత్కూరు మండలం దత్తప్పగూడెంలోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని, ఇచ్చిన హామీల అమలును పక్కనబెట్టి రాష్ట్ర రాజధానిలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలను పక్కన బెట్టి మునిసిపల్, సింగిల్‌విండోల చైర్మన్లను తన పార్టీలో చేరమని ఒత్తిడి చేయడం, వారు వినకుంటే కౌన్సిలర్లు, డైరెక్టర్లను ప్రలోభపర్చి అవిశ్వాసాలు పెట్టి తప్పించడం చేస్తున్నారని విమర్శించారు. మోత్కూరు, తిరుమలగిరి మునిసిపల్ చైర్మన్లను, మోత్కూరు, అడ్డగూడూరు సింగిల్ విండోల చైర్మన్లను అవిశ్వాసాలతో దించి కాంగ్రెస్ వశం చేసుకున్నామని మురవడం కాదు, దమ్మంటే వచ్చే ఎన్నికల్లో గెలిచి మురవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ ఇసుక అమ్ముకుంటున్నారని ఎన్నికల్లో గగ్గోలు పెట్టి, దోసెడు ఇసుక పోనివ్వనని శపథంచేసి ఎన్నికల్లో గెలిచాక ఇప్పుడు ఎమ్మెల్యే సామేల్ చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రభుత్వ అనుమతితో పోయినట్టుగానే అప్పుడు కూడా ప్రభుత్వ అనుమతితోనే ఇసుక వెళ్లింది కదా అన్నారు.

సింగిల్ విండోపై విచారణను స్వాగతిస్తున్నా..

మోత్కూరు సింగిల్‌విండోలో సుమారు 30ఏళ్లుగా తాను, తన కుమారుడే చైర్మన్లుగా ఉన్నామని, ఇటీవల తన కుమారున్ని అవిశ్వాసంతో దించి కాంగ్రెస్ కైవసం చేసుకున్నాక జరిగిన పాలక వర్గ సమావేశంలో సింగిల్‌విండోలో 20 ఏళ్లలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తానని ఎమ్మెల్యే ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ విచారణను తాను స్వాగతిస్తున్నానన్నారు. తమ కాలంలో సింగిల్ విండోలో ఒక్క రూపాయి అవినీతి జరిగినట్లు నిరూపించినా ఏ శిక్షకైనా తాను సిద్ధమేనన్నారు.

సాగు చేసే ప్రతీ ఎకరాకు 'రైతు భరోసా' ఇవ్వాలి

ఎన్నికల్లో వాగ్దానం చేసినట్టుగా రైతులకు ఎకరాకు రూ.15వేలు రైతు భరోసా ఇవ్వలేక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులు అభిప్రాయ సేకరణ సాకుతో ఐదెకరాలలోపు వారికే రైతు భరోసా ఇవ్వడానికి కుట్ర చేస్తోందన్నారు. సాగుచేసే ప్రతీ ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ పురుగుల మల్లయ్య, నాయకులు కొండా సోంమల్లు, అండెం రాజిరెడ్డి, గజ్జి మల్లేష్, రాంపాక నాగయ్య, పి.విష్ణుమూర్తి, మంచె గోవర్ధన్, మల్లం అనిత తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అసైదుల్లా హొరతి

- జిల్లాలో పీర్ల పండుగ సందడి
- ప్రారంభమైన ఇస్లామిక్ నూతన సంవత్సరం



భువనగిరిలో ప్రతిష్ఠించిన పీర్లు

భువనగిరి టౌన్, జూలై 7: హక్కుల పోరాటాల్లో ప్రాణత్యాగం చేసిన అమరుల సంస్మరణార్థం నిర్వహించే మొహర్రం పండుగ సందడి జిల్లాలో ప్రారంభమైంది. అలాగే ఇస్లామిక్ నూతన సంవత్సరం కూడా ఆదివారం ప్రారంభమైంది. దీంతో జిల్లాలో పీర్ల పండుగ సందడి నెలకొంది. ముస్లింలలోని షియావర్గం, హిందువులలో కొందరు మొహర్రం పండుగను సంప్రదాయంగా నిర్వహిస్తారు. పీర్ల పండుగను కులమతాల కతీతంగా పండుగ కాగా, 10 రోజుల పాటు సంతాప దినాలు పాటిస్తారు. పీర్ల కొట్టాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పీర్లను గ్రామాల్లో ఊరేగిస్తారు. ఇళ్ల ముందుకు వచ్చే పీర్లకు భక్తులు దట్టీలు కొట్టి మొక్కు చెల్లించుకుంటారు. అగ్ని గుండాలు తొక్కుతారు. షియా సంఘం ఆధ్వర్యంలో మొహర్రం చివరి రోజున 17న అమరులను స్మరిస్తూ పదునైన ఆయుధాలతో ఒంటి నుంచి రక్తం చిందిస్తూ మాతం ప్రదర్శన నిర్వహిస్తారు. జిల్లా కేంద్రం భువనగిరిలోని 17 అషూర్ ఖానాల్లో, జిల్లాలోని పలు గ్రామాల్లో పీర్లను ప్రతిష్ఠించారు. దీంతో గ్రామాల్లో పీర్ల పండుగ సందడి నెలకొంది. మొహర్రం పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు షియా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రజాహుస్సేన్ తెలిపారు.

'బోనాల'కు సిద్ధమవుతున్న భువనగిరి

తొలి బోనం సమర్పణ



పోచమ్మ ఆలయంలో భక్తుల పూజలు

భువనగిరి టౌన్, జూలై 7: బోనాల వేడుకలకు భువనగిరి ముస్తాబవుతోంది. ఆషాడ, శ్రావణ మాసాల్లో ప్రతి ఆదివారం బోనాల వేడుకలు నిర్వహిస్తారు. మిగతా రోజుల్లో అమ్మవారి ఆలయాల్లో రెండు మాసాల పాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని పోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, మారెమ్మ ఆలయాల్లో భక్తులు బోనాలు సమర్పించనున్నారు. కొద్ది మంది ఒక్కో బోనం సమర్పిస్తుండగా, మరికొందరు రెండు, మూడు బోనాలు సమర్పిస్తారు. దీంతో బోనాల ఊరేగింపులు డప్పు చప్పుళ్లు, బాణాసంచా పేలుళ్లు, శివసత్తుల శిగాలతో రెండు మాసాల పాటు పట్టణంలో పండుగ వాతావరణం నెలకొననుంది. ఈ మేరకు ఆలయాల మరమ్మతులు, రంగులు వేసే పనులను ప్రారంభించారు. భువనగిరి తొలి బోనాన్ని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆజాద్‌రోడ్డు, పోచమ్మవాడ, గాంధీనగర్, కిసాన్‌నగర్‌లోని అమ్మవారి ఆలయాల్లో ఆషాడం తొలి బోనాన్ని సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మాయ దశరథ, కౌన్సిలర్లు రత్నపురం బలరాం, వడిశర్ల లక్ష్మి, కైరంకొండ వెంకటేష్, పచ్చర్ల హేమలత, తాడూరి అంజయ్య, బాల శంకర్, తాడూరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

ప్రజాప్రతినిధులకు బాధిత రైతుల వినతి



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భువనగిరి రూరల్, జూలై 7: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చాలని భూనిర్వాసిత రైతులు పలువురు ప్రజాప్రతినిధులను కోరారు. ఆదివారం రాయిగిరికి చెందిన ఆర్‌ఆర్‌ఆర్ బాధితులు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతులతో సంబంధం లేకుండా బలవంతంగా పోలీసుల పహారాలో వ్యవసాయ భూముల్లో సర్వే చేయించిందన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి విస్తరణ, బస్వాపురం ఫీడర్ ఛానల్, రిలయన్స్ గ్యాస్ పైప్‌లైన్, హైటెన్షన్ విద్యుత్ స్తంభాల ఏర్పాటు, బునాదిగాని కాల్వ నిర్మాణానికి భూసేకరణ చేపట్టడంతో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. ప్రస్తుతం ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంతో ఉన్న కొద్ది భూమి కోల్పోయి రోడ్డునపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. దీంతో ప్రజాప్రతినిధులు స్పందిస్తూ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, బాధిత రైతులు అవిశెట్టి పాండు యాదవ్, కోటాల అనిల్, బొజ్జ రమేశ్, చామల మధు, సాదమైన స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం..
యాదగిరిక్షేత్రం
•7లో..

కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో
ట్రామాకేర్ సెంటర్
•7లో..

టోల్ ఫ్రీ.. టెన్షన్ ఫ్రీ
- సమస్య ఏదైనా.. ఒకే ఒక్క ఫోన్ కాల్‌తో పరిష్కారం

చివ్వెంలలో ఇద్దరి బలవన్మరణం

● తల్లి మందలించిందని ఒకరు ● అనారోగ్యంతో మరొకరు ఆత్మహత్య

చివ్వెంల, జూలై 7: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో శనివారం వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. చివ్వెంల ఎస్‌ఐ రత్నం తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కుడకుడకు చెందిన జి.మహేష్ (28)కు ఏడాది క్రితం గాయంవారిగూడెం గ్రామానికి చెందిన నాగలక్ష్మితో వివాహమైంది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆరు నెలల క్రితం విడిపోయారు. అప్పటినుంచి మద్యానికి బానిసైన మహేష్‌ను తల్లి మందలించింది. శనివారం సాయంత్రం తల్లితో గొడవపడి ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన తల్లి మహేష్‌ను సూర్యాపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మహేష్ మృతదేహం

● అనారోగ్యంతో బాధపడుతూ ఓ కిరాణా వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. చివ్వెంల ఎస్‌ఐ రత్నం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంజలూరు గ్రామానికి చెందిన పెదపోలు శ్రీనివాస్(40) కిరాణ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడేళ్ల నుంచి తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో కొద్ది కాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన భార్య రజిత శ్రీనివాస్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రత్నం తెలిపారు.


శ్రీనివాస్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు ● కోళ్ల వాహనాన్ని ఢీకొన్న కారు ● వాహనం పైనుంచి పడటంతో మృత్యువాత

పెద్దఅడిశర్లపల్లి, జూలై 7: కోళ్ల వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం శనివారం అర్ధరాత్రి 2 గంటలకు నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండల పరిధిలో జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై అంగడిపేట ఎక్స్‌రోడ్డు సెంటర్‌లో చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లికి చెందిన రేబెల్లి అజయ్ (20) పదిహేను రోజులుగా తెప్పలమడుగు గ్రామానికి చెందిన ఐతనబోయిన గిరి కోళ్ల వాహనం నడుపుతూ చికెన్ షాపులకు కోళ్లు సరఫరా చేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి మండల పరిధిలో కోళ్లు సరఫరా చేయడానికి గుడిపల్లి గ్రామం నుంచి వస్తూ అంగడిపేట ఎక్స్‌రోడ్డు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా పెద్దవూర నుంచి వస్తున్న కారు కోళ్ల వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్ వాహనం పల్టీలు కొట్టింది. వాహనం డోర్ తెరుచుకుని అజయ్ కిందపడగా కోళ్ల వాహనం అతని పైనుంచి పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంలో ఉన్న మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని వెంటనే 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రమణయ్య (రామన్న) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.


అజయ్ (ఫైల్‌ఫొటో)

వరసగా విద్యుత్ మోటార్ల చోరీ


హుజూర్‌నగర్, జూలై 7: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద గల విద్యుత్ మోటార్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. కొన్ని రోజులుగా అమరవరంలో 20 మోటార్లు, సీతారాంపురంలో 15, లింగగిరిలో 20, శ్రీనివాసపురంలో 50 మోటార్లకు పైగా చోరీకి గురైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో మోటార్ ఖరీదు రూ.50వేలు ఉంటుందని రైతులు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చోరీలు ఆగలేదని రైతులు వాపోతున్నారు. వానాకాలం సీజన్‌లో పంటలకు నీరు రానున్నందున రైతులు బోర్లు, బావులు ఏర్పాటు చేసుకుని మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. మోటార్ల చోరీ అవుతుండటంతో మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉందని, తమపై అదనంగా ఆర్థిక భారం పడిందని రైతులు వాపోతున్నారు. పోలీసులు గస్తీ పెంచి చోరీలను కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

క్వింటా రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్, జూలై 7: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో క్వింటా రేషన్‌బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కోదాడ రూరల్ ఏఎస్‌ఐ రాజా తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని కూచిపూడి తండాకు చెందిన బాణోతు శివరాం బైక్‌పై ఆదివారం క్వింటా రేషన్ బియ్యాన్ని మోటార్ సైకిల్‌పై రెడ్లకుంట మీదుగా ఆంధ్రప్రదేశ్ వైపునకు తరలిస్తున్నాడు. కాపుగల్లు శివారులో అతడిని పోలీసులు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అతని వద్ద నుంచి రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, శివరాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాజా తెలిపారు.

సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు మృతి

కోదాడ రూరల్, జూలై 7: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మర గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సామినేని వెంకటేశ్వర్లు (84) మృతి చెందాడు. తమ్మర మాజీ సర్పంచ్ సామినేని వెంకటేశ్వర్లు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం తన నివాసంలో మృతి చెందారు. వెంకటేశ్వర్లు తమ్మర గ్రామ సర్పంచ్‌గా సుమారు 20 సంవత్సరాలకు పైగా పనిచేశారు. తమ్మర గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం కమిటీ చైర్మన్‌గా 20 సంవత్సరాలు పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన తర్వాత ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో చేరి, అదే పార్టీలో కొనసాగారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కోడలు సామినేని ప్రమీలరమేష్ మునిసిపల్ చైర్మన్‌గా కొనసాగుతుండగా, మరో కుమారుడు సామినేని నరేష్ మూడో వార్డు కౌన్సిలర్‌గా పనిచేస్తున్నాడు. సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో పేదలకు పక్కా గృహాలు నిర్మించడానికి, తమ్మరకు హైస్కూల్ తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు. తమ్మర ఆలయానికి చెందిన బీడు భూములను సాగులోకి తెచ్చారు. వెంకటేశ్వర్లు మృతికి ఎమ్మెల్యే పద్మావతి, పీసీసీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావుతో పాటు పలువురు కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు.


ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో సామినేని వెంకటేశ్వర్లు

రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీ

● సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వర్లు



రాజకీయ శిక్షణ తరగతులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మునుగోడు రూరల్, జూలై 7: రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. నిరంకుశత్వం, మతోన్మాద రాజకీయాలు భారతదేశానికి ప్రమాదమని అన్నారు. మూడోసారి అధికారం వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. విద్య వైద్య రంగాలను కార్పొరేట్ శక్తుల నుంచి విడిపించి ప్రభుత్వరంగంలో ఉంచాలన్నారు. సమావేశంలో 'పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం' అనే అంశంపై సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ప్రసంగించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండా శ్రీశైలం, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు అయితగోని విజయ్‌కుమార్, నాయకులు చాపల మారయ్య, నాంపల్లి చంద్రమౌళి, మిర్యాల భరత్, ఏర్పుల యాదయ్య, ముత్యాలు, శివకుమార్, ధనంజయగౌడ్, నరసింహ, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు


నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

చింతపల్లి, జూలై 7: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని విరాట్‌నగర్ గ్రామంలో చైన్‌స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి సీఐ నవీన్, చింతపల్లి ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.... మండలంలోని కుర్మేడు గ్రామానికి చెందిన గోరటి బక్కమ్మ భర్త నర్సింహతో కలిసి గత నెల 26వ తేదీన విరాట్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలేంపల్లి గ్రామానికి చెందిన కుర్రా తుల్సానాయక్, సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ధరావత్ బాలకృష్ణ ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చారు. బైక్‌పై వెళ్తున్న బక్కమ్మతో మాటమాట కలిపారు. అనంతరం ఆమె మెడలో నుంచి 4 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు నేతృత్వంలో చింతపల్లి పోలీసులు బృందాలు ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. చింతపల్లి హైవే సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీల్లోని వివరాలతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుండగా సాయిబాబా దేవాలయ సమీపంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించట్లు వారు తెలిపారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది కిరణ్, శివకుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో బంగారుపతకం

● గట్టుప్పల్ విద్యార్థి నితిన్‌కుమార్ ప్రతిభ

గట్టుప్పల్, జూలై 7: ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒకటైన సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న జెల్లా నితిన్‌కుమార్ ఫైనల్ పరీక్షల్లో కళాశాలలోనే అత్యధిక మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. ఈ మేరకు కళాశాల యజమాన్యం నితిన్‌కుమార్‌ను అభినందిస్తూ బంగారుపతకం, నగదు పురస్కారంతో సత్కరించింది. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత జెల్లా జగన్నాథం కుమారుడైన నితిన్‌కుమార్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడని పలువురు కొనియాడారు. గోల్డ్‌మెడల్ సాధించిన నితిన్‌కుమార్‌ను కుటుంబసభ్యులు, నాయకులు, గ్రామస్థులు అభినందించారు.



కుళ్లిన స్థితిలో

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతదేహం లభ్యం

కొత్తపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధిలో అద్దె ఇంట్లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా తిప్పర్తికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తెరతేపల్లి నరేష్ (35) సాయినగర్ రోడ్ నెం 4లో ఎస్‌కే మూర్తికి చెందిన ఇంట్లో రెండు నెలల నుంచి అద్దెకు ఉంటున్నాడు. అతడు బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య ప్రసవానికి మిర్యాలగూడకు వెళ్లిందని, తాను ఇంటి వద్ద నుండే పనిచేస్తానని నరేష్ ఇంటి యజమానికి చెప్పాడు. అతడు హైబీపీతో సతమతమవుతున్నట్లు తెలిసింది. అతడు ఇంట్లో పని అవసరం ఉన్నప్పుడు పనిమనిషికి ఫోన్‌చేసి చెప్పేవాడు. బుధవారం పనిమనిషి అతడి ఇంట్లో పనిచేసి వెళ్లింది. గురువారం నుంచి అతడు పనిమనిషికి ఫోన్ చేయలేదని తెలిసింది. ఆదివారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇంటి యజమాని మూర్తి 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చారు. నాగోల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ఇంటి తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూశారు. నరేష్ మృతదేహం బోర్లా పడి కుళ్లిన స్థితిలో కనిపించింది. పోలీసులు అతడి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి తెరతేపల్లి రమేష్‌కు సమాచారం ఇచ్చారు. రమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాకింత.. మీకింత

ఎన్నికల సందడిలో ఎవరు పట్టించుకుంటారని అనుకున్నారేమో.. హడావుడిగా చేసిన పనుల్లో నాణ్యత లోపించగా, అధికారులు ఇవేవీ పట్టనట్టు బిల్లులు కూడా చేశారు. రూ.1.42కోట్లతో నిధుల్లో 30శాతం కూడా ఖర్చుచేయలేదని ఆరోపణలు ఉండగా, ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కయ్యారనే విమర్శలు వినవస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

- నామినేటెడ్ ఎమ్మెల్యే నిధులతో నాణ్యతలేని హైమాస్ట్‌లైట్లు
- ఎన్నికల సందర్భంలో సాగర్ నియోజకవర్గంలో అడ్డగోలు వ్యవహారం
- 30 శాతం వినియోగించలేదనే ఆరోపణలు
- రూ.1.42కోట్ల నిధులతో పనులు
- వెలగకుండా మొరాయిస్తున్న లైట్లు
- నాణ్యతలేకపోయినా బిల్లులు మంజూరుచేసిన అధికారులు



నిడమనూరు మండలం పార్వతీపురంలో కనీస రక్షణ ఏర్పాట్లు లేని హైమాస్ట్‌లైట్ టవర్

నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ నిధులతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లు నాణ్యతాలోపంతో కునారిల్లుతున్నాయి. లైట్లు బిగించి ఆరుమాసాలు కాకముందే పనిచేయకుండా మొరాయిస్తున్నాయి. రూ.1.42కోట్ల నిధులతో చేపట్టిన ఈ పనులకు 30శాతం నిధులు కూడా ఖర్చుచేయలేదని, కళ్లెదుటే నిబంధనలను అతిక్రమించినా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పట్టించుకోకపోగా, బిల్లులు మంజూరు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల హడావిడి, ప్రభుత్వం మారిన సందర్భంలో నిధుల కైంకర్యమే లక్ష్యంగా ఈ హైమాస్ట్ లైట్ల ఏర్పాటు సాగగా, పనుల్లో నాణ్యతను ఎవ్వరూ పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోవడంతో ఈబిల్లుల చెల్లింపులు పూర్తి కాలేదని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, లైట్లను సక్రమంగా ఏర్పాటుచేశాకే బిల్లులు చెల్లించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల సమయంలో అడ్డగోలు వ్యవహారం

నియోజకవర్గ అభివృద్ధి కింద నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ కోటా నుంచి 2023-24 సంవత్సరానికి రూ.1.42కోట్ల నిధులతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ పనులు నాసిరకంగా, నాణ్యతాలోపంతో ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలోని అనుముల, పెద్దవూర, నిడమనూరు, త్రిపురారం, గుర్రంపోడు మండలాల్లోని 46 గ్రామాల్లో 66 హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేశారు. అందుకు రూ.1,42,85,625 నిధులు మంజూరు చేశారు. పనులన్నింటినీ ఒక కాంట్రాక్టర్‌కు నామినేషన్ పద్ధతిలో కేటాయించగా, అప్పటి సాగర్ ఎమ్మెల్యే కనుసన్నల్లో ఈ హైమాస్ట్ లైట్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో ఎంపీడీవోలు నిర్ధారించి, పనులకు ఆర్డర్లు ఇచ్చారు. అనంతరం ఎన్నికలు రావడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను హడావిడిగా నాణ్యతలేకుండా పూర్తిచేశాడు. లైట్లు బిగించి ఆరునెలలు కూడా కాకమునుపే సగానికిపైగా వెలగకపోగా, మిగిలిన చోట్ల స్థానికులే లైట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పనులకు పంచాయతీరాజ్ ఏఈలు ఇప్పటికే ఎంబీలు చేయగా, మొత్తం 66 పనులకు రూ.1,42,60,424 బిల్లులు చెల్లించేందుకు డీఈ మంజూరు చేశారు. సిద్ధిపేట కలెక్టరేట్ నుంచి నిధులు నల్లగొండ సీపీవోకు కూడా ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. అయితే నిధుల లేమితో బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడింది. ఈ పనుల నాణ్యతాలోపంపై వివరణ కోరేందుకు హాలియా డీఈఈని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.

30 శాతం నిధులే ఖర్చు?

హైమాస్ట్‌లైట్ల ఏర్పాటుకు ఒక్కోదానికి కనిష్ఠంగా రూ.1,99,517వ్యయం చూపించగా,గరిష్ఠంగా రూ.1,99,990 ఖర్చు చూపించారు. వాస్తవంగా నాసిరకం పనులతో పాటు, నాణ్యతలేని సామగ్రి ఉపయోగించడం, తక్కువ లైట్లు బిగించడం, కొన్ని పనులు చేయకపోవడం వంటి లోపాలతో ఒక్కోలైటుకు గరిష్ఠంగా రూ.40వేలకు మించి ఖర్చవదని పలువురు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు, సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ఈరకంగా పరిశీలిస్తే ఒక్కో హైమాస్ట్ లైట్‌కు గరిష్ఠంగా రూ.1.50లక్షల వరకు అవినీతికి ఆస్కారమేర్పడిందని,దీనిపై సమగ్రవిచారణ జరిపి,నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతాలోపం, నాసిరకం పనులు

నాగార్జునసాగర్‌నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 66 హైమాస్ట్‌లైట్ల ఏర్పాటు పనుల్లో ఎక్కడా నాణ్యత పాటించలేదు. ఇలా నాణ్యతలేని, నాసిరకం పనులు చేపట్టడంతో 66 హైమాస్ట్ లైట్లలో ప్రస్తుతం పనిచేయకపోవడంతో కొన్నిచోట్ల ఆయా గ్రామాల ప్రజలే స్వచ్ఛందంగా లైట్లు ఏర్పాటుచేసుకున్నారు. లైట్ల ఏర్పాటుతో పాటు ఐదేళ్ల పాటు నిర్వహణ కూడా సంబంధిత కాంట్రాక్టరే చూసుకోవాలి. అలాంటి నిర్వహణ ఏదీ ప్రస్తుతం ఈ లైట్ల వద్ద లేదు. దీన్ని పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో లైట్ల నిర్వహణ ప్రస్తుతం గ్రామపంచాయతీలకు గుదిబండగా మారాయని కార్యదర్శులు వాపోతున్నారు.





అనుముల మండలం పేరూరులో కనీస నాణ్యతలేకుండా నిర్మించిన హైమాస్ట్ లైట్

పేరూరులో లోపించిన నాణ్యత ప్రమాణాలు




పేరూరులోని హైమాస్ట్‌లైట్‌లో కాలిపోయిన ఫ్లడ్‌లైట్

- హైమాస్ట్ లైట్‌కు ఏర్పాటు చేసిన జీఐ స్తంభం కనీసం 9మీటర్ల నుంచి గరిష్ఠంగా 11 మీటర్ల వరకు ఉండాలి. కాగా, అన్నిచోట్లా ఏడుమీటర్లకే పరిమితమైంది.
- ఒక్కో హైమాస్ట్ టవర్‌కు 150 వోల్ట్స్ సామర్థ్యం ఉన్న ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లు ఎనిమిది ఏర్పాటుచేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల ఆరు,కొన్నిచోట్ల మూడులైట్లే బిగించారు. వీటిల్లోనూ ప్రస్తుతం ఒకటి, రెండు లైట్లు మినహా మిగిలినవి పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- ఐఎస్ఐ స్టాండర్డ్ లైట్లను వాడాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా నాసిరకం, తక్కువ నాణ్యతగల కంపెనీల లైట్లు వాడారు. డమ్మీ స్టిక్కరింగ్ చేసి నాణ్యత పరిశీలించకుండా పనులు పూర్తిచేశారు.
- హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేసిన ప్రతీ చోట ప్రత్యేకంగా ఎర్తింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలి. 2.1మీటర్ల లోతు గుంత తవ్వి, అందులో ఉప్పు, బొగ్గు సమానంగా నింపి, వాటిల్లో నుంచి 40మిల్లీమీటర్ల వ్యాసంతో ఉండే 2.5మీటర్ల జీఐ పైప్‌ను బిగించి, దాని ద్వారా హైమాస్ట్ లైట్‌కు ఎర్తింగ్ కనెక్షన్ ఇవ్వాలి. ఏ లైట్ వద్ద కూడా అలాంటి ఏర్పాట్లు చేయలేదు. కొన్నిచోట్ల నామమాత్రంగా భూమిలో చిన్న గుంతతవ్వి, ఒక జీఐ వైర్‌ను లైట్‌కి అమర్చారు.
- స్విచ్‌బోర్డులో మూడు ఎంసీబీలను వినియోగించాల్సి ఉండగా, ఒక్కోటి అమర్చి టైమర్ ఏర్పాటు చేసి కండక్టర్‌తో పనిపూర్తిచేశారు. హైమాస్ట్‌లైట్ స్తంభాలను ఏర్పాటు చేసే చోట మీటరున్నర లోతు గుంతతవ్వి, ఆపైన మూడుమీటర్ల ఎత్తు, మూడుమీటర్ల పొడువు, మూడు మీటర్ల వెడల్పుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి దాని మధ్యలో లైటు స్తంభాన్ని బిగించాలి. ఈ 66 పనుల్లో ఒక్కటంటే ఒక్కచోట కూడా ఇలా ఫౌండేషన్ ఏర్పాటు చేయలేదు.
- ప్రతీ హైమాస్ట్ లైటు వద్ద అడుగువెడల్పు, అడుగు పొడవుతో శిలాఫలకం ఏర్పాటుచేసిన ఈ లైటును ఏ సంవత్సరం, ఏ నిధులు, ఎంత వ్యయంతో ఏర్పాటు చేశారనే వివరాలు రాయాలి. అలాంటివేవీ ఇక్కడ లేవు.

విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్

- చెల్లింపులన్నీ డిస్కంల సైట్లలోనే
- ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ శాఖ



నల్లగొండ టౌన్, జూలై 7: విద్యుత్ బిల్లులు ఈ నెల 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌లు (ఫోన్‌పే గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్)ల ద్వారా చెల్లించడం కుదరదని భారత రిజర్వు బ్యాంకు నిబంధన విధించింది. దీంతో విద్యుత్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ సంస్థలకు సంబంధించిన సైట్లు, యాప్ ద్వారా నేరుగా బిల్లులు చెల్లించాలని పేర్కొంటున్నారు. వాస్తవానికి ఈ విధానం చాలా రోజుల నుంచే మనుగడలో ఉంది. కానీ వినియోగదారులు మాత్రం ఇతర యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లిస్తున్నారు. ఈ ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి టీజీఎస్పీడీసీఎల్ వారు విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్ ముద్రించనున్నారు. ఈ విధానం జిల్లాలో వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానుంది. అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లను కార్పొరేట్ కార్యాలయాల్లో సిద్ధం చేస్తున్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను వచ్చే నెల నుంచి అన్ని ఈఆర్వో కార్యాలయాలకు పంపించనున్నారు.

ప్రస్తుతానికి రెండు విధానాల ద్వారా...

తాజాగా విద్యుత్ సంస్థలు థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిపివేయడంతో వినియోగదారులు టీజీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్ డెస్క్ ద్వారా నేరుగా బిల్లులు చెల్లించవచ్చు. ప్లేస్టోర్ నుంచి టీజీఎస్పీడీసీఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఈ యాప్‌లో బిల్లుల చెల్లింపులు, ఫిర్యాదులు, బిల్లింగ్ హిస్టరీ, సెల్ఫ్ రీడింగ్, విద్యుత్ అధికారిని సంప్రదించడానికి అవకాశం ఉంది. పే బిల్స్‌లోకి వెళ్లి యూఎస్‌సీ నంబర్ నమోదు చేసిన తర్వాత డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, వాలెట్ల నుంచి బిల్లులు చెల్లించవచ్చు. జిల్లాలో మొత్తం 8 లక్షల 9 వేల 414 విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఇందులో 4 లక్షల 88వేల 302 గృహ విద్యుత్ వినియోగదారులు 70,951 మంది వాణిజ్య వినియోగదారులు ఉండగా వీటిలో సుమారు 2.40 లక్షల వినియోగదారులకు గృహజ్యోతి పథకంలో జీరో బిల్లులు వస్తున్నాయి. వీరు పోగా మిగతా వారంతా వివిధ రూపాలలో విద్యుత్ శాఖకు బిల్లులు చెల్లిస్తున్నారు.

త్వరలోనే క్యూర్ విధానం అమలు

వచ్చే నెల నుంచి బిల్లుల చెల్లింపునకు క్యూర్ విధానం అమలులోకి రానుంది. ఇందుకోసం ఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని వినియోగదారుల కనెక్షన్ వివరాలు, ఫోన్ నెంబర్ వంటివి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నారు. ఆగస్టు నెల నుంచి మీటర్ రీడర్లు రీడింగ్ తీసే సమయంలో వినియోదారుల వివరాలు,మీటర్ యూఎస్సీ నంబర్, సర్వీస్ నెంబర్ బిల్లు వివరాలను క్యూఆర్ కోడ్‌లో ముద్రించి బిల్లును అందించనున్నారు. వినియోగదారుడు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు నేరుగా బిల్లు చెల్లించడానికి అవకాశం ఉంటుంది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసిన తర్వాత వచ్చేనెల నుంచి విద్యుత్ బిల్లుల్లో క్యూర్ కోడ్ విధానం వస్తుందని అధికారులు తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనానికి ప్రాధాన్యం ఇవ్వాలి

జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

హాలియా, జూలై 7: రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిల సమావేశం రెండు రాష్ట్రాలకు శుభ పరిణామమని, రా జకీయ ప్రయోజనాలు కాకుండా రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినకుండా చర్యలు ఉండాలని మాజీ శాసనసభ్యు లు, సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా హాలియాలో ఆదివారం నిర్వహించి న సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల విషయంలో సరై న నిర్ణయం తీసుకోవాలని, తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన విద్యుత్ బకాయిలను, ఉద్యోగుల బదిలీలు, ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన గ్రామాలపై చర్చించి అందరికీ ఆమోదకరమైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రధాన రహదారుల విస్తరణ, నదులపై బ్రిడ్జీలు, రెండు రాష్ట్రాల ఆస్తి పంపకాలలో రాష్ట్ర ప్రయోజనాలకు భంగం లేకుండా నిర్ణయా లు తీసుకోవాలని కోరారు. ఇద్దరు ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి విభజన హామీలను అమలు చేయించాలన్నారు. రాజకీయాల ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనానికి సీఎం ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. రాష్ట్రాల మధ్య తగువలు పెట్టే పద్ధతి కాకుండా ఉన్నటువంటి పంచాయితీలు తీర్చే పద్ధతిలో కేంద్రం వ్యవహరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కూన్‌రెడ్డి నాగిరెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ, కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, ఖమ్మంపాటి శంకర్, గోవర్ధనమ్మ, శంకరయ్య, రవినాయక్, మల్లయ్య, సైదులు పాల్గొన్నారు.

'అనగనగా ఒక ఊరు... అమ్మనబోలు'కు సెన్సార్ సర్టిఫికెట్

నార్కట్‌పల్లి, జూలై 7: 'అనగనగా ఒక ఊరు అమ్మనబోలు' డాక్యుమెంటరీకి సెన్సార్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికెట్ (సీబీఎఫ్‌సీ) లభించింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన వర్ధమాన సినీ దర్శకుడు నరేష్ రాపోలు ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. పాశ్చాత్య పోకడలు దరిచేరని సమయంలో వారసత్వంగా వచ్చిన పూర్వపు గ్రామీణ జీవన సాంస్కృతిక శైలి... పల్లె వాతావరణానికి అనుసంధానమైన కళాకారుల ప్రదర్శనలు ఆనాటి ప్రజల రోజువారీ జీవన విధానంలో భాగస్వామ్యమైన తీరు కళ్లకు కట్టినట్లు చూపించారు. కుల, మతాలకతీతంగా కళాకారుల ప్రదర్శనలతో అలనాటి జానపద కళారూపాలకున్న ఆదరణను నరేష్ తన డాక్యుమెంటరీలో చిత్రీకరించారు. కానీ యాంత్రిక యుగంలో వెండితెర రాకతో కళలు... కళాకారుల దయనీయ స్థితి ఎలా ఉందో తన ఊరే ఉదాహరణగా నరేష్ రూపొందించిన 'అనగనగా ఒక ఊరు...అమ్మనబోలు' డాక్యుమెంటరీకి సీబీఎఫ్‌సీ సర్టిఫికెట్‌ను అందజేసింది.

శాస్త్రోక్తంగా నృసింహుడికి నిత్య పూజలు



ప్రసాద క్యూలైన్లలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు

భువనగిరి అర్బన్, జూలై 7: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో ఆదివారం ఉదయం నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట లక్ష్మీనృసింహులకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. అదేవిధంగా శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనంచేశారు. సాధారణ సందర్శనలో భాగంగా కొండకింద కల్యాణకట్ట, సంస్కృత పాఠశాల, తులసీ కాటేజీలోని నృసింహ సదనం భవనంలోని గదులను ఈవో భాస్కర్‌రావు పరిశీలించి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

భక్తజనసంద్రం.. యాదగిరిక్షేత్రం

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. గోల్కొండ బోనాల నేపథ్యంలో భక్తుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టినా.. ఆదివారం వారాంతపు సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు క్షేత్ర సందర్శనకు రాగా, వీఐపీ టికెట్ దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. బ్రేక్ దర్శనం, ఆరగింపు సమయంలో క్యూలైన్లు నిలిపివేయడంతో ప్రధానాలయం, క్యూకాంప్లెక్స్‌లోని క్యూలైన్, ఉభయ దర్శన క్యూలైన్లలోనే కాక ప్రసాద విక్రయశాల వద్ద కూడా రద్దీ నెలకొంది. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆలయ అధికారుల ఆదేశాలతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.49,02,345 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

భక్తులకు శఠగోపం ప్రారంభం

ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థం ఎప్పటినుంచో అందజేస్తుండగా శఠగోపం ఆదివారం ప్రారంభించారు. ఉద్ఘాటనకు ముందు లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులకు పూజారి శఠగోపం, తీర్థం ఇచ్చేవారు. పాత ఆచారాల పునరుద్ధరణలో భాగంగా ప్రధానాలయంలో నుంచి బయటకు వచ్చే మార్గంలో హుండీ సమీపంలో భక్తులకు శఠగోపం పెడుతున్నారు.

కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో ట్రామాకేర్ సెంటర్

- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి వెంకట్‌రెడ్డి
- పనులను పరిశీలించిన నల్లగొండ ఆర్డీవో




కొర్లపహాడ్ టోల్‌ప్లాజా ఆవరణలో ట్రామా కేర్ సెంటర్ శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలిస్తున్న నల్లగొండ ఆర్డీవో రవి

కేతేపల్లి, జూలై 7: 65వ నెంబర్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా ఆవరణలో నిర్మించే ట్రామాకేర్ సెంటర్ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించే లక్ష్యంతో ఈ ట్రామా కేర్‌సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి చేసి ప్రారంభించనున్నారు. ఈ మేరకు నల్లగొండ ఆర్డీవో ఆదివారం టోల్‌ప్లాజావద్ద శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో వెంట కేతేపల్లి తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

టోల్ ఫ్రీ.. టెన్షన్ ఫ్రీ





- సమస్య ఏదైనా.. ఒకే ఒక్క ఫోన్ కాల్‌తో పరిష్కారం
- సమస్యలు, వేధింపుల నుంచి ఉపశమనం కలిగిస్తున్న టోల్ ఫ్రీ నెంబర్లు

భువనగిరి టౌన్, జూలై 7: సమస్యలు ఏవైనా ఒక్క ఫోన్ కాల్‌తో పరిష్కారం లభిస్తోంది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వేధింపులు, వైద్యం, అగ్ని ప్రమాదం, రవాణా సౌకర్యం, భద్రత తదితర సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల టోల్‌ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తెచ్చాయి.

పోలీస్ సాయం కోసం 100

శాంతి భద్రతల సమస్యలతోపాటు దొంగలు వచ్చినా, రోడ్డుపై ప్రమాదం జరిగినా, ఏదైనా విపత్కర పరిస్థితులు ఎదురైనా వెంటనే 100కు డయల్ చేస్తే సమీప పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు సకాలంలో చేరుకొని ఆదుకుంటారు. ఓ సర్వే ప్రకారం 100నెంబర్‌కే అత్యధిక కాల్స్ వచ్చినట్లు తేలింది.

అగ్ని ప్రమాదం జరిగితే 101

అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. అదే సమయంలో అగ్ని మాపక శాఖకు సమాచారం ఇచ్చేందుకు ఫైర్ స్టేషన్ నెంబర్ తెలుసుకునేందుకు ఇబ్బందులు పడుతుంటారు.కానీ అగ్ని ప్రమాదాల సమాచారాన్ని చేరవేసేందుకు ఆ శాఖ 101టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. టోల్‌ఫ్రీ నెంబర్‌ను కాల్ చేసిన వెంటనే హైదరాబాద్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా సమీపంలోని అగ్ని మాపక శాఖకు సమాచారం వెళ్తుంది. ఆవెంటనే ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుంది.

గృహ హింసపై 181

సాధారణంగా మహిళలు పలు రకాలతో గృహహింసకు గురవుతుంటారు. కానీ ఎవరికీ సమాచారం ఇవ్వాలో తెలియక సతమతమవుతుంటారు. ఈ తరహా మహిళలు టోల్‌ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేస్తే వెంటనే స్థానిక పోలీసులు చేరుకొని న్యాయం చేస్తారు.

అంబులెన్స్ సేవలకు 108

అత్యవసర వైద్యం, బాధితులను ఆసుపత్రులకు తరలించేందుకు 108కు ఫోన్ చేస్తే వెంటనే అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను ఆసుపత్రులకు తరలిస్తుంది. 108 అంబులెన్స్‌లోని వైద్య సిబ్బంది బాధితులకు ప్రాథమిక చికిత్సలు అందజేస్తారు. దీంతో రోడ్డు ప్రమాద తదితర బాధితులకు వెంటనే ప్రాథమిక చికిత్స అందడంతో పాటు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ఆసుపత్రులకు సకాలంలో చేరవేసే అవకాశం ఉండడంతో ప్రాణాలు మిగిలే ఆశలు ఉంటాయి.

టెలికాం సేవలకు 198

ఏ నెట్ వర్క్ పరిధిలోనైనా 198 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేస్తే బిల్లు వివరాలు, నెట్‌వర్క్ మారడం, రీచార్జ్ తదితర సమాచారాన్ని తెలుసుకోవచ్చు. అలాగే నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని రకాల సమాచారం అందుతుంది.

1098 పిల్లల భద్రతకు

తప్పిపోయిన పిల్లల సమాచారం, వేధింపులకు గురవుతున్న పిల్లలను కాపాడేందుకు, పిల్లలను బాలకార్మికులుగా వినియోగించుకున్న 1098కు కాల్ చేస్తే వెంటనే సమీపంలోని బాలల సంరక్షణ సమితి, పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగి పిల్లలను కాపాడుతారు.

ఈవ్ టీజింగ్ నివారణకు 1091

ఈవ్ టీజింగ్‌కు గురయ్యే బాలికలు, మహిళలు 1091కు ఫోన్ చేస్తే కంట్రోల్ రూం ద్వారా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది. ఆ వెంటనే ని మిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకొని ఈవ్‌టీజింగ్ నుంచి కాపాడుతా రు. నిందితులను అదుపులోకి తీసుకుంటారు.


ఓటు నమోదు కోసం 1950

గతంలో ఓటు నమోదుకోసం బీఎల్‌వోలపై ఆధారపడాల్సిన పరిస్థితి. కానీ కేంద్ర ఎన్నికల సంఘం అమల్లోకి తెచ్చిన సంస్కరణల ఫలితంగా 1950 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి వచ్చింది. 18 ఏళ్ల నిండిన వారంతా టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఓటు నమోదు చేసుకోవచ్చు. అలాగే సవరణలు, ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్, ఓటరు జాబితాలో సీరియల్ నెంబర్ తదితర వివరాలను తెలుసుకోవచ్చు.

ఉపాధి హామీ కోసం 180020014455

ఉపాధి హామీపథకం గ్రామీణ పేదల ఆకలి తీరుస్తోంది. అయితే పథకం అమలులో అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా పలువురు అర్హులు జాబ్ కార్డు పొందలేకపోతున్నారు. మరి కొందరిని విధుల నుంచి తొలగిస్తున్నారు. ఈ తరహా బాధితులు ఉపాధి హామీ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి న్యాయం పొందవచ్చు. అలాగే పథకం అమలులో జరుగుతున్న అవినీతిపై సమాచారం ఇవ్వవచ్చు.

గర్భిణీల కోసం 102



రవాణా సదుపాయం తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోనూ ఆసుపత్రులకు వెళ్లే స్తోమతలేని గర్భిణులు పురిటినొప్పులతో బాధ పడుతుంటే 102కు డయల్ చేస్తే వెంటనే అంబులెన్స్ వాహనం వారి ఇంటికి వెళ్తుంది. అంబులెన్స్‌లో ఆశా కార్యకర్త లేదా ఏఎన్ఎం ఉంటారు. గర్భిణీని అంబులెన్స్ ద్వారా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రసవం చేయిస్తారు. ప్రసవం అనంతరం 102 వాహనంలోనే తిరిగి ఇంటి వద్ద దిగబెడతారు. అయితే 6వ నెల, 9వ నెల గర్భిణీలను కూడా ఉచితంగానే 102 వాహనంలో చెకప్‌లకు ఆసుపత్రులకు తీసుకవెళ్లి తిరిగి ఇంటి వద్ద దిగబెడతారు.

రైల్వే సేవలు.. 139



సాధారణంగా రైల్వే సమాచారం తెలుసుకోవడం అందరికి గగణమే. కానీ రైల్వే శాఖ అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేడ్ రైల్వేహెల్ప్‌లైన్ 139కు ఫోన్‌చేస్తే అవసరమైన సమాచారం అంతా క్షణాల్లో అందుబాటులోకి వస్తుంది. 12 విభిన్న భాషల్లో హెల్ప్ లైన్ అందుబాటులో ఉంటుంది.


కిసాన్ కాల్ సెంటర్.. 18001801551

దేశంలో 25 కిసాన్ కాల్ సెంటర్లు ఉన్నాయి. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, అనుమానాలపై కిసాన్ కాల్ సెంటర్ నెంబర్‌కు ఫోన్‌చేస్తే సమీప వ్యవసాయ అధికారికి సమాచారం వెళ్తుంది.ఆఅధికారి తగిన పరిష్కారం చూపుతారు.

ట్రాన్స్‌కో సమస్యలపై 18004250028

విద్యుత్ కనెక్షన్లు, ఇతర సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌కో టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చు. సమస్యను నమోదు చేసుకొని సకాలంలో పరిష్కరిస్తారు. పరిష్కారం లభించని యెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేయవచ్చు. విద్యుత్ సరఫరా అంతరాయం, ప్రమాద అవకాశాలు, నూతన కనెక్షన్లు,పేరు మార్పుతదితర సేవలను పొందవచ్చు.

విమాన ప్రయాణం.. 18002004599



విమాన ప్రయాణ సమాచారం తెలుసుకోవడం చాలా మంది కష్టతరంగా భావిస్తుంటారు. కానీ పై టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే విమాన రవాణా సమాచారంతోపాటు ఎయిర్‌పోర్టులకు వెళ్లే పుష్పక్ బస్సుల సమాచారం అందుబాటులోకి వస్తుంది.

తపాలా సేవలకు 18001805232

తపాలా శాఖకు సంబంధించిన సేవలు, సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా పరిష్కారం లభిస్తుంది. నూతన ఖాతాలు, పొదుపు నిల్వలు, బీమా, నూతన పథకాలు తదితర సేవలన్ని తెలుసుకోవచ్చని తపాలా శాఖ అధికారులు అంటున్నారు.

ఆర్‌ఎంపీలపై దాడులు ఆపాలి

● గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్యగౌడ్

మోత్కూరు, జూలై 7: గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ అతి తక్కువ ఫీజుతో వైద్య సేవలందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్లపై మెడికల్ కౌన్సిల్ వారు చేసే దాడులు ఆపాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల లక్ష్మయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం మోత్కూరులో నిర్వహించిన గ్రామీణ వైద్యుల సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ వైద్యులపై దాడులు అరికట్టాలని తాము సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించామని, ఆయన సానుకూలంగా స్పందించినప్పటికీ మెడికల్ కౌన్సిల్ వారు దాడులు జరుపుతూనే ఉన్నారన్నారు. నిరంతరం గ్రామాల్లో ఉంటూ వైద్య సేవలందిస్తున్న తమపై దాడులు చేస్తే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం 1273 జీవో ఇచ్చి ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు శిక్షణనిచ్చారని, కేసీఆర్ ప్రభుత్వం జీవో నెం.428 ఇచ్చింది గాని, శిక్షణ ఇవ్వలేదన్నారు. ఈ ప్రభుత్వం కూడా అవసరమని భావిస్తే ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి ప్రజలకు వైద్యసేవలందించే అవకాశం ఇవ్వాలన్నారు అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎ.యాదవరెడ్డి, ఎల్.రఘువర్ధన్, అధ్యక్షునిగా గనగాని నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకర్, ప్రచార కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు భిక్షం, గణేష్, గుండాల మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, సోమలింగాచారి, అశోక్, చంద్రమౌళి పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు తరలిన కుమ్మరులు



మండలకేంద్రం నుంచి బయలుదేరి వెళుతున్న కుమ్మర కులస్థులు

తుర్కపల్లి, జూలై 7: హైదరాబాద్‌లోని గోల్కొండలో ఆషాడ మాసంలో కుమ్మరలు నిర్వహించే తొలి బోనం కార్యక్రమానికి ఆదివారం మండల కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కుమ్మరులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు దేవరుప్పుల అయిలయ్య మాట్లాడుతూ గోల్కొండలో ప్రతియేటా జగదాంబిక అమ్మవారికి కుమ్మర్ల తొలి బోనంతో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం ఆలేరు కన్వీనర్, కో కన్వీనర్ జివిలీకపల్లి ఆంజనేయులు, దేవరుప్పల మల్లేశం, గౌరవ అధ్యక్షుడు దేవరుప్పల బాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, మాజీ సర్పంచ్ రాజయ్య, నాయకులు రేణుకుంట భాస్కర్, ఇంద్రపాల సత్యనారాయణ, జాగిల్లపురం సత్యనారాయణ, కొలిపాక కొండల్, ఇంద్రపాల కృష్ణ, యూత్ అధ్యక్షుడు తీగుళ్ల బాలకృష్ణ, కుమార్, జివిలీకపల్లి మహేశ్, శ్రవణ్, మధు, రామస్వామి, కిషన్, రాములు ఉన్నారు.

మెటల్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

వలిగొండ, జూలై 7: కేర్చుపల్లి- సుంకిశాల గ్రామాల నడుమ ఉన్న మెటల్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కమిటీ సభ్యుడు కందడి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, సత్యనారాయణ, మల్లయ్య, సాయిరెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు గుర్తించి పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాద్గుల ప్రభాకర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూలై 7: ఉపాధ్యాయులు తమ హక్కులతోపాటు బాధ్యతలు గుర్తించి పనిచేయాలని, ప్రజలతో మమేకమై పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని మాజీ ఎంపీపీ మాద్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పాదూరి సురేందర్‌రెడ్డి పదోన్నతిపై చౌటుప్పల్ మండలానికి బదిలీపై వెళ్లగా మండల పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎస్.నర్సింహారావు అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సన్మాన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశంయాదవ్, ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జాలిగం రామ్మోహన్‌రావు, సన్మాన గ్రహీత మండల అధ్యక్షుడు పాదూరి సురేందర్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మంద సోమరాజు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, ఎండీ మహ్మద్‌అలీ, గురునాథం, జేవై దానయ్య, రమాదేవి, సీహెచ్ నరేష్‌రెడ్డి, కె విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

అడ్డగూడూరు, జూలై 7: ద్విచక్రవామనం ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం మండలంలోని చౌళ్లరామారంస్టేజీ వద్ద ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. చౌళ్లరామారం గ్రామానికి చెందిన నాగెల్లి స్వామిదాస్ విశాంత్రి కోసం, దేవరుప్పలకు చెందిన జోగు యాదలక్ష్మి బస్సు కోసం వేచిచూస్తూ జాతీయ రహదరి వెంట నిర్మించిన డ్రైనేజీ దిమ్మెపై కూర్చున్నారు. అదేసమయంలో కొండగడప గ్రామానికి చెందిన బోడ యాదగిరి ద్విచక్రవాహనంపై తిరుమలగిరి వెళుతూ దిమ్మెపై కూర్చున్న ఇద్దరిని ఢీకొట్టడంతో నాగెల్లి స్వామిదాస్ కుడికాలు విరిగిపోగా, యాదలక్ష్మి మోకాలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనదారుడు బైక్ ఆపకుండా వెళ్తుతుండగా, స్థానికులు వెంబడించి మండలంలోని చిత్రగూడూరు స్టేజీ వద్ద పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108లో క్షతగాత్రులను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ నాగరాజును సంప్రదించగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బిక్కేరును తోడేస్తున్నారు

● వాగు నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా ● నెంబరులేని వాహనాల్లో అక్రమంగా తరలింపు
● అడుగంటుతున్న భూగర్భజలాలు ● ఆవేదన వ్యక్తం చేస్తున్నరైతులు ● చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

చిత్రగూడూరు బిక్కేరు వాగులో ఇసుక తరలించడంతో ఏర్పడిన గుంతలు



అడ్డగూడూరు, జూలై 7: అడ్డగూడూరు మండలంలోని చిత్రగూడూరు బిక్కేరు వాగు నుంచి రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ వాగు నుంచి ఇసుకను తరలిస్తే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని, దీంతో నీటికొరత ఏర్పడుతుందని రైతులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతీరోజు రాత్రి 10 గంటలు దాటిందంటే ట్రాక్టర్ల మోతతో ఈ ప్రాంతం భయానకంగా మారుతోందని, ఆ సమయంలో పొరపాటున అటువైపు ఎవరైనా వచ్చారంటే ప్రమదాలు జరిగే అవకాశాలున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతోపాటు అనుభవంలేని 18ఏళ్లలోపు పిల్లలు కూడా ట్రాక్టర్లను నడుపుతూ ఇసుకను తరలిస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం, బొడ్డుగూడెం, కంచనపల్లి, మోత్కూరు మండలంలోని పాటిమట్ల, అనాజిపురం, దత్తప్పగూడెం తదితర గ్రామాలకు ఇసుక సమస్య తీవ్రంగా ఉండడంతో దీన్ని ఆసరాగా చేసుకున్న ఇసుకాసురులు రాత్రి సమయాల్లో ఇసుకను తరలిస్తూ అధిక ధరకు విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. ఇదంతా అధికారుల అండదండలతోనే కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక రవాణాపై ప్రశ్నించిన వారిని అడ్డొస్తే తొక్కేస్తాం అంటూ ట్రాక్టర్ల యాజమానులు బెదరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నెంబర్‌ప్లేట్ లేని ట్రాక్టర్లలో..

ఇసుకను తరలించే ట్రాక్టర్లకు ఇక్కడ నెంబర్ ప్లేట్లు ఉండడంలేదు. నిబంధనల ప్రకారం రెవెన్యూ అధికారులు అనుమతివ్వాలంటే ఇంజన్‌కు, ట్రాలీకి సైతం నెంబర్ ఇవ్వాల్సిందే. అయితే నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్ల ద్వారానే ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అడ్డొస్తే తొక్కిస్తా అంటున్నారు



పగలూ, రాత్రి తేడా లేకుండా ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుకను తరలించవద్దంటూ అడ్డుకుంటే ట్రాక్టర్‌తో తొక్కిస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల శబ్దానికి నిద్రపట్టడంలేదు. అధికారులు స్పందించి ఇసుక రవాణాను అరికట్టాలి.

చిత్తలూరి సోమనారాయణ, రైతు, చిత్రగూడూరు

భూగర్భజలాలు అడుగంటుతున్నాయి



వానాకాలంలో సకాలంలో వర్షాలు కురవడంలేదు. అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటి పంటపొలాలు ఎండుతున్నాయి. బిక్కేరు వాగులో ఇసుక తరలించడంవల్ల భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయి తాగు, సాగు నీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి ఇసుక రవాణాను అడుకోవాలి.

పల్రెపాటి సోమేష్, రైతు, చిత్రగూడూరు

కఠిన చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణా ఎక్కడ జరుగుతుందో ప్రజలు మా దృష్టికి తెస్తే కేసులు నమోదు చేస్తాం. నిఘా పెంచి ఇసుక రవాణాను అడ్డుకుంటాం.

శేషగిరిరావు, తహసీల్దార్, అడ్డగూడూరు

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

● జిల్లావ్యాప్తంగా ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



మోటకొండూరులో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు

చౌటుప్పల్ టౌన్, జూలై 7: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ జాతికి అన్నిరంగాల్లో న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం చౌటుప్పల్ పట్టణంలో కేక్‌కట్ చేశారు. బస్‌స్టేషన్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు బోయ దేవేందర్, ఊదరి వెంకటేశ్, బోయ రామ్, ఊదరి శ్రీకాంత్, శ్యామ్, బోదుల నరేష్, వెంకట్, బాబు, సంపత్, అరవింద్, పాల్గొన్నారు.

మోటకొండూర్: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వంగపల్లి చిరంజీవి ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బొట్ల శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బైరపాక నాగరాజు, వెల్మజాల యాదయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఘనత ఎమ్మార్పీఎస్‌దేనని ఆ సంఘం జాతీయ నాయకుడు మంద శంకర్ మాదిగ తెలిపారు. గుట్టలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బూడిద జాని, సుంచు ప్రేమ్, భిక్షపతి, గోపి నాగరాజు, నవీన్, చంటి, శివ, క్రాంతి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని భువనగిరిలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, నాయకులు భట్టు రాంచంద్రయ్య, బండారు రవివర్ధన్, సందెల శ్రీనివాస్, సురిపంగ సుభాష్ పాల్గొన్నారు.

బీబీనగర్: బీబీనగర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలతోపాటు వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దూరి నర్సింగ్ రావు, మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య, గోసుకొండ సంజీవరావు, అమరేందర్, సోమారం శంకర్, మద్దూరి జంగయ్య, బస్వయ్య పాల్గొన్నారు.

వలిగొండ: ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు పల్లెర్ల రామచందర్, నాయకులు దుబ్బ దానయ్య, కందుల అంజయ్య, భిక్షపతి, యాదగిరి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని పట్టణ అధ్యక్షుడు పెద్దల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య, కుక్క స్వామి, నాగేష్, కుమార్, దానయ్య ఉన్నారు.

శానిటేషన్ అధికారులకు నోటీసులు

● నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు

భువనగిరి అర్బన్, జూలై 7: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కొండకింద విధులు నిర్వహించే శానిటేషన్ అధికారులకు నోటీసులు అందజేయాలని దేవస్థాన పరిపాలన విభాగం అధికారిని ఈవో భాస్కర్‌రావు ఆదేశించారు. కొండకింద లక్ష్మీపుష్కరిణి వద్ద సులభ్ కాంప్లెక్స్ వద్ద మహిళల మరుగుదొడ్ల వద్ద మహిళలకు బదులు పురుషుడిని నియమించినందుకు అధికారులపై ఈవో మండిపడ్డారు. మహిళల మరుగుదొడ్ల వద్ద మహిళలనే నియమించాలని ఆదేశించారు. జరిగిన ఈ పొరపాటుకు కొండకింద పనిచేసే శానిటేషన్ అధికారులను బాధ్యులను చేస్తూ సోమవారం నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది. కాగా, వాకీటాకీ వాడని ఏఈఈవోను ఈవో మందలించినట్లు తెలిసింది.

సోదరభావంతోనే సామరస్యత

● ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జహంగీర్

భువనగిరి టౌన్, జూలై 7: వివిధ వర్గాల ప్రజల మధ్య సోదరభావం కలిగి ఉంటేనే సామరస్యత, లౌకికవాదం సాధ్యమవుతుందని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జహంగీర్ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన ఆవాజ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అయితే కొన్ని శక్తుల కార్యలాపాలతో అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఈ మేరకు లౌకికవాద ప్రజాతంత్ర శక్తులకు బలం చేకూరేలా ఆగస్టు 10, 11వ తేదీల్లో భువనగిరిలో ఆవాజ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా న్యాయవాది ఎంఏ రహీంతో కూడిన ఆహ్వాన సంఘాన్ని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు ఎంఏ ఇక్బాల్, ఎస్‌కే లతీఫ్, ఎస్‌కె హమీద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గుజ్జ గ్రామంలో సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సంస్థాన్‌నారాయణపురం, జూలై 7: సంస్థాన్‌నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మసమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, శ్రీరాములరెడ్డి, రాములు, శ్రీనివాసరావు, విద్యాసాగర్, పూర్వ విద్యార్థులు జగదీశ్వర్, అనిత, మహిమున, నారాయణ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాతికేళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు పట్టాభి రామారావు, కానుగుల వెంకటయ్య, రుక్కమ్మ, అంజయ్య, యాదగిరి, బీమిడి మోహన్‌రెడ్డిలను సన్మానించారు.

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని వంకమామిడి 2002-03 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను, మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్థసారథి, నరసింహాచారి, దామోదర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, అరుణ, విద్యార్థులు లింగస్వామి, నరసింహ, మహేందర్, సైదులు, కుమార్, మహేందర్, గీత, సంపతి రాధా, రోజా పాల్గొన్నారు.



వంకమామిడిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

భువనగిరి రూరల్, జూలై 7: గ్రామీణులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మాటూరి బాలరాజు గౌడ్, కార్యదర్శి దయ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని నమాత్‌పల్లిలోని పలువార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తించారు. ధ్వంసమైన సీసీరోడ్లు, నమాత్‌పల్లి నుంచి తుక్కాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం, గ్రామ శివారులోని కోళ్లఫాంనుంచి వచ్చే వ్యర్థాల వల్ల కలిగే ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లంల వెంకటేశ్, జిట్టా అంజిరెడ్డి, సుర్పంగ ప్రకాశ్, బత్తిని దానయ్య, కిష్టయ్య, ప్రకాశ్ తదితరులున్నారు.

తైక్వాండో జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



ఎన్నికైన నూతన కార్యవర్గం

భువనగిరి రూరల్, జూలై 7: తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం భువనగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కొండ సైదులు, ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి శ్రీకాంత్, కోశాధికారిగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా పెండియాల వెంకటేశ్, జాయింట్ సెక్రటరీగా మంగ ప్రవీణ్ తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ దాసరి సుధీర్, రిటర్నింగ్ అధికారిగా కిషన్ వ్యవహరించారు.

సామాజిక అంశాలపై పరిశోధనలు అభినందనీయం

రామన్నపేట, జూలై 7: సామాజిక అంశాలపై యూనివర్సిటీల్లో పరిశోధనలు చేయడం అభినందనీయమని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. రాజకీయాల్లో దివ్యాంగుల ప్రత్యేక పాత్ర అనే అంశంపై పరిశోధన చేసి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన డాక్టర్ ఎర్రోళ్ల(ఎన్) అశోక్‌ను ఆదివారం హైదరాబాద్‌లో అభినందించి మాట్లాడారు. డ్రగ్స్ తదితర దురాచారాలపై కూడా పరిశోధనలు చేసి సమాజాన్ని చైతన్య పర్చాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగుల చట్టం 2016ను అసెంబ్లీ ఆమోదించేలా కృషి చేయాలని డాక్టర్ అశోక్ చేసిన సూచనల మేరకు ప్రొఫెసర్ కోదండరాం స్పందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

చంద్రబాబు సభకు తరలిన నేతలు

భువనగిరి రూరల్, జూలై 7: హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు భువనగిరి నుంచి తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎర్రబోయిన రమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకు లు రేగు బీరప్ప, సిద్ధగోని ధనుంజయ్ గౌడ్, మాద్గుల ఉపేందర్ పాల్గొన్నారు.



భువనగిరి నుంచి బయలుదేరి వెళుతున్న టీడీపీ నేతలు



మోటకొండూర్: మోటకొండూర్ ఎస్ఐగా ఎస్.పాండు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధు నిర్వహించిన తేజంరెడ్డి హైదరాబాద్‌లోని గ్రీన్ ఫార్మాసిటీకి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటంలో సర్వేజన సుఖినోభవంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండేళ్లుగా యోగా ధ్యాన మందిరంలో సేవలు అందిస్తున్న యోగా గురువు పాలకూర్ల పాండు, నిర్వాహకులు సోమ జనార్ధన్‌రెడ్డిలను ఫౌండేషన్ చైర్మన్ సోమ శ్రీనివాస్‌రెడ్డిలు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగాపురం గంగాధర్, బాతరాజు లింగస్వామి, రాచకొండ శ్రీనివాస్, గోద గోవర్ధన్, పాపయ్య పాల్గొన్నారు.

తుర్కపల్లి: బంజారా గిరిజనులు ఎంతో పవిత్రంగా నిర్వహించే శీత్లా భవాని పండుగను వేర్వేరు తేదీల్లో కాకుండా ఈ నెల 9న మంగళవారం ఒకేసారి నిర్వహించి, జాతి ఐక్యతను చాటుకుందామని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్‌నాయక్ ఒక ప్రకటనలో కోరారు.

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం గ్రామదేవత ఉప్పలమ్మ పండుగ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాజాపేట: రాజాపేట మండల ధూపదీప, నైవేద్య అర్చక సంఘం మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బొమ్మ కిషోర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వైరాగ్యం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నీలం కృష్ణ, సహాయ కార్యదర్శిగా నల్ల విష్ణు, కోశాధికారిగా టీ.పాండురంగస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని అంతమ్మగూడెం బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా వస్పరి రాకేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుండ్ల రాజుయాదవ్, బీజేపీ కిసాన్‌సెల్ జిల్లా నాయకులు మేకల చొక్కారెడ్డి ఆధ్వర్యంలో గ్రామకమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా వస్పరి రాకేష్, ఉపాధ్యక్షులుగా వస్పరి నరేందర్, వల్లూరి నవీన్, ప్రధానకార్యదర్శిగా రావుల వినోద్, కార్యదర్శిగా గుమ్మి పవన్‌రెడ్డి, కోశాధికారిగా సుర్కంటి రామకృష్ణారెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యాదగిరిగుట్ట రూరల్: స్థానికంగా జరిగే వివాదాలపై బీఆర్ఎస్ నాయకులు ఆలోచించి మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్ అన్నారు. కొబ్బరిబొండాల దుకాణ నిర్వాహకుడి ఫిర్యాదు వివాదంపై బీఆర్ఎస్ నాయకులు అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో చీర శ్రీశైలం, బందారపు భిక్షపతి, గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్ తదితరులున్నారు.

మోత్కూరు: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని పద్మశాలి కాలనీకి చెందిన పసునూరు సోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రథమ సంవత్సరంలో ఫీజులు చెల్లించడానికి ఇబ్బంది పడిన ఆమె తల్లిదండ్రులు ఈ ఏడాది ఫీజు చెల్లించలేమని చెప్పడంతో ఆ విద్యార్థిని ఆదివారం కాంగ్రెస్ జిల్లానేత పైళ్ల సోమిరెడ్డి వద్దకు వెళ్లి తనకు ఉన్నత చదువులకు సహాయం చేయాలని కోరింది. వెంటనే స్పందించిన ఆయన రూ.5వేలు ఇవ్వగా ఆయనతోపాటు బాలాజీ జిన్నింగ్ మిల్లు యజమాని ఎగుమాటి రాంరెడ్డి రూ.10వేలు, సోమేశ్వర ఆర్‌ఎంసీ ప్లాంట్ భాగస్వామి బిట్ల బాబు రూ.10వేలు, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు లింగాల జైపాల్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థికసహాయం అందజేశారు. ఉపాధ్యాయుడు ఎదుళ్ల సుధీర్‌రెడ్డి, ఎడమ నర్సిరెడ్డి, పైళ్ల నర్సిరెడ్డి, కారుపోతుల వెంకట్, పురుగుల నర్సింహ, ఎండి.సమీర్, కొణతం నరేందర్‌రెడ్డి వారి వెంట ఉన్నారు.

● మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాచకొండ రాములమ్మ, బిట్టు రామకోటి, రేగటి లక్ష్మీ కుటుంబాలను మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చలక్ష్మీనర్సింహారెడ్డి ఆదివారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండెబోయిన మల్లేష్, గిరగాని శ్రీనివాస్, రచ్చ సంజీవరెడ్డి, బండ సంజీవరెడ్డి, గనగాని యాదగిరి, దొండ దశరథ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామంలో కొంపెల్లి సోమయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో నాయకులు బీమిరెడ్డి తిర్మల్‌రెడ్డి, గుదే మధుసూదన్, కొంపెల్లి గణేష్, అల్ల శివప్రసాద్, అలందర్, నర్సయ్య, చంద్రమౌళి, రమేష్ పాల్గొన్నారు.

పాఠశాల పునర్ వైభవానికి కృషి

భువనగిరి టౌన్, జూలై 7: భువనగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ వైభవానికి కృషి చేయాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, శెట్టి బాలయ్య యాదవ్ అన్నారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత భవన పునర్నిర్మాణానికి పూర్వ విద్యార్థులు సహకరించాలన్నారు. ఈ నెల 28న సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అలాగే సంఘం సభ్యత్వం పెంపునకు తీర్మాణం చేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు పి.నరేందర్‌రెడ్డి, నక్కల లక్ష్మీనారాయణ, భజరంగ్ ప్రసాద్, తాడూరి కిష్టయ్య, డాక్టర్ ఏ.నర్సింహారావు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.